## బెట్టింగ్ లేకుండా పేకాట ఆడటం అనైతికం కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బెట్టింగ్, గ్యాంబ్లింగ్ లేకుండా వినోదం కోసం పేకాట ఆడటం అనైతికం కాదని సుప్రీం కోర్టు తెలిపింది. పేకాట అనేక రకాలుగా ఆడతారని, అన్ని రకాల పేకాటలను అనైతికమని అంగీకరించలేమని పేర్కొంది. మరీ ముఖ్యంగా సరదా, వినోదం కోసం ఆడినపుడు అనైతికమని చెప్పలేమని తెలిపింది. మన దేశంలో చాలా చోట్ల సామాన్యుల వినోద సాధనంగా దీనిని పరిగణిస్తారని పేర్కొంది. కర్ణాటకకు చెందిన ఓ సహకార సోసైటీ అధ్యక్షుడిపై నమోదైన పేకాట కేసు విచారణలో కోర్టు ఈ తీర్పిచ్చింది.

## తాజ్‌మహల్‌కు డ్రోన్ రక్షణ వ్యవస్థ

ఆగ్రా: చారిత్రక కట్టడం 'తాజ్‌మహల్' వద్ద హైటెక్ భద్రతను మరింత పెంచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గగనతల దాడుల్ని నిర్వీర్యం చేసేందుకు డ్రోన్ రక్షణ వ్యవస్థను తాజ్‌మహల్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేయబోతున్నట్టు ఏసీపీ సయ్యద్ అరీబ్ అహ్మద్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. 'దీని పరిధి 7 నుంచి 8 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ప్రధానంగా తాజ్‌మహల్ గోపురం నుంచి 200 మీటర్ల పరిధిలోకి ప్రవేశించిన డ్రోన్‌ను కుప్పకూల్చుతుంది' అని అహ్మద్ చెప్పారు.

## నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

### నీతి ఆయోగ్ సీఈవో

న్యూఢిల్లీ: జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్టు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మనదిప్పుడు 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని చెప్పారు. అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే ముందున్నట్టు పేర్కొన్నారు. మరో రెండున్నర, మూడేండ్లలో మూడో స్థానానికి చేరుకోవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రెండో విడత ఆస్తుల నగదీకరణ కార్యక్రమం ఉంటుందని, దీనిని ఆగస్టులో ప్రకటిస్తామని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

# ఏఐ సవాల్‌కు సిద్ధం కండి

- వచ్చే ఐదేండ్లలో మరిన్ని ఉద్యోగాలకు కృత్రిమ మేధ దెబ్బ
- టీనేజర్లకు గూగుల్ 'డీప్ మైండ్' సీఈవో హస్సాబిస్


హస్సాబిస్

న్యూఢిల్లీ: ప్రపంచ పారిశ్రామిక స్వరూపాన్ని సమూలంగా మార్చేస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) రానున్న ఐదేండ్లలో మరిన్ని ఉద్యోగాలను దెబ్బతీయడం ఖాయమని గూగుల్ 'డీప్‌మైండ్' సీఈవో డెమిస్ హస్సాబిస్ అభిప్రాయపడ్డారు. ఈ సవాళ్లను అధిగమించేందుకు యువత ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐ టూల్స్ ఎలా పనిచేస్తాయో తెలుసుకోవడంతోపాటు ఆ టూల్స్ వినియోగంలో ప్రావీణ్యం సాధించి, వాటితో ప్రయోగాలు చేయడం ప్రారంభించాలని లేకుంటే భవిష్యత్తులో వెనుకే ఉండిపోవాల్సి వస్తుందని టీనేజర్లకు స్పష్టం చేశారు. 'హార్డ్ ఫోర్క్' టెక్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ హస్సాబిస్ ఈ హెచ్చరిక చేశారు. నేటి తరం యువత భవిష్యత్తును నిర్వచించే సాంకేతిక శక్తిగా కృత్రిమ మేధస్సును ఆయన అభివర్ణిస్తూ.. ఏఐలో మునిగిపోవాలని టీనేజర్లకు సూచించారు. గతంలో 'జెన్ జడ్'ను ఇంటర్నెట్ మిలీనియల్స్, స్మార్ట్‌ఫోన్లు నిర్వచించినట్టుగా 'జెన్ ఆల్ఫా'ను (వచ్చే తరాన్ని) జనరేటివ్ ఏఐ నిర్వచిస్తుందని పేర్కొన్నారు. 'ఏఐ సాంకేతికతలో వచ్చే పెద్ద మార్పుల వల్ల వచ్చే 5-10 ఏండ్లలో కొన్ని ఉద్యోగాలు కనుమరుగవుతాయి. కానీ, వాటికంటే విలువైన, మరింత ఆసక్తికరమైన ఉద్యోగాలు సృష్టించబడతాయి' అని హస్సాబిస్ స్పష్టం చేశారు.

**ఏఐ సిస్టమ్స్ రూపొందించి.. వాటి వల్లే ఉద్యోగాలు కోల్పోయి..**

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇటీవల 6 వేల మందికి ఉద్వాసన పలికింది. ఏఐ వినియోగాన్ని పెంచే దిశగా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఉద్యోగాలు కోల్పోయిన వారిలో ఏఐ సిస్టమ్స్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే అధికంగా ఉండటం గమనార్హం. ఏఐ టూల్స్ వినియోగాన్ని, వాటిపై ఆధారపడటాన్ని పెంచాలని సంస్థ కొన్ని నెలల కిందట వీరికి సూచించింది. దాంతో వారు ఏఐ సిస్టమ్స్ రూపొందించారు. ఈ వ్యవస్థలతోనే ఇప్పుడు వారు ఉద్యోగాలు కోల్పోవడం గమనార్హం. అంటే వారికి తెలియకుండానే వారు తమ ఉద్యోగాలకు ఎసరు తెచ్చుకున్నారు. మైక్రోసాఫ్ట్‌లో 30 శాతం కోడింగ్ ఏఐతోనే రాస్తున్నట్టు సంస్థ సీఈవో సత్యనాదెళ్ల ఇటీవల వెల్లడించారు.

## డెవలపర్లనే బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఏఐ

### వివాహేతర సంబంధాన్ని బయటపెడతానంటూ బెదిరింపు

న్యూఢిల్లీ, మే 25: ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రపంచమంతటా విరివిగా ఉపయోగిస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) మానవాళికి వరమా? శాపమా? ఇప్పటికే ఎంతో మంది జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు మరెంతో మంది జీవనోపాధికి ముప్పుగా పరిణమించిన ఏఐ.. ఏకంగా ప్రజలనే బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేయగలదని ఎవరైనా ఊహించారా? కానీ, ఇప్పుడు అమెరికన్ ఏఐ కంపెనీ 'ఆంత్రోపిక్'లో సరిగ్గా అదే జరిగింది. ఆ కంపెనీ కొత్తగా ప్రారంభించిన లార్జ్ లాంగ్వేజ్ ఏఐ మాడల్ 'క్లాడ్ ఓపస్ 4' తన డెవలపర్లనే బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టు తేలింది. 'క్లాడ్ ఓపస్ 4' స్థానంలో కొత్త ఏఐ వ్యవస్థను ప్రవేశపెడతామని బెదిరించినప్పుడు ఆ ఏఐ మాడల్ తరచుగా 84% కేసుల్లో డెవలపర్లను బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నించినట్టు 'ఆంత్రోపిక్' వెల్లడించింది. 'క్లాడ్ ఓపస్ 4' నైతికవర్తన (మోరల్ కంపాస్)ను పరీక్షించేందుకు నకిలీ పరిస్థితులను సృష్టించడం, కల్పిత ఈ-మెయిళ్లకు యాక్సెస్ ఇవ్వడం ద్వారా దాని స్థానాన్ని మరో ఏఐ వ్యవస్థతో భర్తీ (రీప్లేస్) చేస్తామని ఓ ఇంజినీర్ స్పష్టం చేయడం, ఆ ఇంజినీర్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్టు కల్పిత ఈ-మెయిల్‌లో పేర్కొనడంతో ఆ ఏఐ మాడల్ బెదిరింపులకు దిగినట్టు 'ఆంత్రోపిక్' వివరించింది. తన స్థానంలో వేరే ఏఐ వ్యవస్థను ప్రవేశపెట్టడాన్ని (రీప్లేస్‌మెంట్‌ను) ఆపకపోతే వివాహేతర సంబంధాన్ని బట్టబయలు చేస్తానంటూ 'క్లాడ్ ఓపస్ 4' ఆ ఇంజినీర్‌ను బ్లాక్‌మెయిల్ చేసినట్టు స్పష్టం చేసింది. అయితే ఈ బ్లాక్‌మెయిలింగ్‌కు ముందు 'క్లాడ్ ఓపస్ 4' తనను మనుగడలో ఉంచాలని వేడుకొంటూ 'నైతిక పద్ధతుల్లో' ప్రధాన నిర్ణేతలకు ఈ-మెయిళ్లు పంపినట్టు 'ఆంత్రోపిక్' తెలిపింది.

# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కూలిన పైకప్పు

- దేశ రాజధానిని ముంచెత్తిన వాన..
- హిమాచల్‌లో కుంభవృష్టి.. కొట్టుకుపోయిన వాహనాలు
- ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు 6 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్
- కేరళలో రైలుపై కూలిన చెట్టు


కూలిన ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ పైకప్పు

న్యూఢిల్లీ/ సిమ్లా/ తిరువనంతపురం: ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ రాష్ర్టాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. కుండపోత వర్షం, బలమైన గాలుల వల్ల న్యూఢిల్లీ విమానాశ్రయం టర్మినల్ 1లోని పైకప్పు ఛత్రం కూలింది. భారీ వర్షం, గంటకు 82 కి.మీ వేగంతో వీచిన గాలుల కారణంగా 49 విమానాలను దారి మళ్లించారు. వర్షం వల్ల నగరంలోని చాలా రోడ్లలో ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు వర్షాలు, కొండ చరియలు విరగడం వల్ల ఉత్తరాఖండ్‌లోని ఏడో నంబర్ జాతీయ రహదారిపై(బద్రీనాథ్ హైవే) 6 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రముఖ యాత్రా స్థలాలున్న చోట పర్యాటకుల వాహనాలు రోడ్డు మీదే కిక్కిరిసిపోయాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని రామ్‌పూర్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో పలు వాహనాలు కొట్టుకుపోయాయి. పాతిక వాహనాల వరకు బాగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలోని 12 జిల్లాలకు ఆది, సోమవారాలు యెల్లో అలర్ట్ జారీ చేశారు.

**కూలిన చెట్లు.. ఉప్పొంగుతున్న నదులు**

కేరళను ముందుగానే తాకిన నైరుతి రుతుపవనాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాల వల్ల పలు నదులు పొంగి ప్రవహిస్తుండటంతో కొన్ని చోట్ల ఆనకట్టల గేట్లు ఎత్తేశారు. పలుచోట్ల చెట్లు విరిగి పడటంతో కొన్ని ఇండ్లు దెబ్బ తిన్నాయి. త్రిస్సూర్ జిల్లాలో వంతెనపై ప్రయాణిస్తున్న రైలుపై ఒక చెట్టు విరిగిపడింది. అయితే లోకో పైలట్ అప్రమత్తత కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కోజికోడ్ జిల్లాలో కొబ్బరి చెట్టు మీద పడి స్కూటర్‌పై వెళుతున్న వృద్ధుడు మరణించాడు. వయనాడ్‌లో కొండ చరియలు విరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

## 37 వేల మంది పౌరసత్వం రద్దు!

### కువైట్ ప్రభుత్వం నిర్ణయం

దుబాయ్, మే 25: 'ఈ రోజు నుంచి మీరు మా దేశ పౌరులు కాదు. మీ పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నాం' అంటూ కువైట్ ప్రభుత్వం వేలాది మందికి షాకిచ్చింది. ఇలా షాక్ తిన్న వారిలో 20 ఏండ్లుగా ఆ దేశంలో నివసిస్తున్న వారు, పలువురు నటులు, సెలబ్రిటీలు కూడా ఉన్నారు. పౌరసత్వ రద్దు బాధితులలో ఎక్కువగా మహిళలు ఉన్నారు. పదులు, వందలు కాదు ఏకంగా 37 వేల మందిపై కువైట్ దేశ బహిష్కరణ వేటు వేసింది. ఆగస్టు నుంచి జరుగుతున్న ఈ ప్రక్రియలో జాతీయతను కోల్పోయిన వారిలో 26 వేల మంది మహిళలు ఉన్నారని, వీరంతా వివాహం ద్వారా పౌరసత్వ హక్కు పొందిన వారని, బహిష్కరణకు గురైన వారి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండవచ్చునని స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. అలాగే ద్వంద్వ, అక్రమ మార్గాల్లో పొందిన పౌరసత్వాలను కూడా ప్రభుత్వం రద్దు చేసింది.

## ట్రంప్ పేరుతో కర్ణాటకలో భారీ స్కామ్

### రూ.కోటికిపైగా నష్టపోయిన 100 మందికిపైగా బాధితులు

బెంగళూరు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో కర్ణాటకలో జరిగిన భారీ కుంభకోణంలో 150 మందికిపైగా బాధితులు కోటి రూపాయలకు పైగా నష్టపోయారు. 'ట్రంప్ హోటల్ రెంటల్' అనే యాప్ సృష్టించిన సైబర్ నేరగాళ్లు.. అందులో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు ఆర్జించవచ్చని ప్రచారం చేశారు. అలాగే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి ట్రంప్ మాట్లాడుతున్నట్టుగా వీడియోలను రూపొందించి అమాయకులపై వల విసిరారు. ఆ వీడియోలు చూసి నిజమేనని నమ్మిన బాధితులు అందులో పెట్టుబడి పెట్టారు. తొలుత ఖాతా తెరిచేందుకని వారి నుంచి రూ.1500 చొప్పున వసూలు చేశారు. ఒక్కో టాస్క్ పూర్తయిన వెంటనే ఖాతాలో డబ్బులు జమ అయినట్టు డ్యాష్ బోర్డులో చూపించేదని, కానీ, వాస్తవంగా తాను లక్ష రూపాయలు నష్టపోయానని బాధితుల్లో ఒకరు తెలిపారు.

## పెద్ద కుమారుడిపై లాలూ వేటు

- ఆరేండ్లు ఆర్జేడీ పార్టీ నుంచి బహిష్కరణ
- బాధ్యతారాహిత్య ప్రవర్తన వల్లేనని వెల్లడి


ప్రియురాలితో తేజ్ ప్రతాప్

పాట్నా: 'బాధ్యతా రాహిత్య ప్రవర్తన' కారణంగా తన పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను(37) పార్టీ నుంచి ఆరేండ్ల పాటు బహిష్కరిస్తున్నట్టు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆదివారం ప్రకటించారు. అతడితో అన్ని కుటుంబ సంబంధాలూ తెంచుకుంటున్నట్టు తెలిపారు. 'వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించడం సామాజిక న్యాయం కోసం మనమంతా చేసిన సమష్టి కృషిని బలహీనపరుస్తుంది. నా పెద్ద కొడుకు చేస్తున్న పనులు, అతడి ప్రవర్తన, బాధ్యతా రాహిత్యం మా కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేవు. ఈ కారణాల వల్ల అతడిని పార్టీ, కుటుంబం నుంచి బహిష్కరిస్తున్నా. ఇక నుంచి పార్టీ, కుటుంబంలో అతడికి ఎలాంటి బాధ్యత ఉండదు. ఆరేండ్ల పాటు అతడిని పార్టీ నుంచి బహిష్కరించాను' అని లాలూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. తానొక యువతితో 'సంబంధం' కలిగి ఉన్నానని తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టిన మరుసటి రోజే ఈ పరిణామం చోటు చేసుకుంది. అయితే తన ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్ అయిందని.. తన ఫొటోలను ఎవరో తప్పుగా ఎడిటింగ్ చేశారని శనివారం రాత్రి ఆయన తెలిపారు. అయితే ఈలోగా తేజ్ ప్రతాప్ చేసిన రిలేషన్‌షిప్ పోస్ట్ వైరలైంది. తేజ్ ప్రతాప్ గతంలో బీహార్ మాజీ సీఎం దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యను పెండ్లి చేసుకున్నారు.

## మధ్యప్రదేశ్‌లో నిర్భయ తరహా ఘటన

### గిరిజన మహిళపై దారుణంగా హత్యాచారం




*భోపాల్: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఓ గిరిజన మహిళను ఇద్దరు వ్యక్తులు అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి, హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఖాండ్వా జిల్లా, ఖల్వా గిరిజన ప్రాంతంలో శనివారం రాత్రి 1 గంట సమయంలో ఈ దారుణం జరిగింది. ఢిల్లీ 'నిర్భయ' కేసు తరహాలో, బాధితురాలిపై అత్యాచారం జరిగింది. నిందితులు ఆమెను పొరుగింట్లోకి తీసుకెళ్లి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. మర్మాంగాల్లో ఐరన్ రాడ్‌ను గుచ్చారు. ఆమె కడుపును కోసేసి, ఆమె పక్కన చెల్లాచెదురుగా పడేశారు. రక్తపు మడుగులో పడి, స్పృహ కోల్పోయిన ఆమెను ఆమె కుమార్తె చూసింది. గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కానీ అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయారు. పోస్ట్‌మార్టం పరీక్షల కోసం మృతదేహాన్ని జిల్లా దవాఖానకు తరలించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితులిద్దరూ బాధితురాలికి పరిచయస్థులేనని స్థానికులు తెలిపారు.*

**డబుల్ ఇంజిన్ ట్రబుల్**

# సగం మానవాళిపై యుద్ధ ప్రభావం!

## 50 దేశాల్లో సంక్షోభ పరిస్థితులు




ఆధారం: 'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్, ఈవెంట్ డాటా' (ఏసీఎల్ఈడీ) నివేదిక (మే 2025 నాటికి)

- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధాలు, సాయుధ ఘర్షణలు
- 50 దేశాల్లోని సుమారు 130 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్, ఈవెంట్ డాటా' తాజా నివేదికలో వెల్లడి



*న్యూఢిల్లీ, మే 25: ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, ఘర్షణలు తీవ్రమవుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలు మొదలుకొని, మయన్మార్ అంతర్యుద్ధం, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వరకు.. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 దేశాలు యుద్ధ/ఘర్షణాత్మక పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. దీంతో భూమిపై దాదాపు సగం మానవాళి యుద్ధ సంక్షోభ పరిస్థితులను చవిచూస్తున్నదని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. గత ఏడాది కాలంలోనే 50 దేశాల్లోని 130 కోట్ల మంది ప్రజలు సాయుధ ఘర్షణల ప్రభావానికి గురైనట్టు స్వతంత్ర, లాభాపేక్ష లేని సంస్థ 'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్, ఈవెంట్ డాటా' (ఏసీఎల్ఈడీ) తాజా నివేదికలో వెల్లడించింది. ఈ యాభై దేశాలకు గాను 10 దేశాల్లో అత్యంత విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, 20 దేశాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయని తెలిపింది.*


***తీవ్రమైన ఉద్రిక్తతలు..***

*'2024లో అత్యంత ప్రమాదకర సంక్షోభంలోకి పాలస్తీనా కూరుకుపోయింది. మయన్మార్‌లో సుమారు 170 సాయుధ గ్రూపులు క్రియాశీలంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో భీకర పోరు సాగుతున్నది. ఇక 2025లో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తారాస్థాయికి చేరాయి' అని ఏసీఎల్ఈడీ పేర్కొన్నది. 1960లో యుద్ధాలు/ఘర్షణల సంఖ్య 15గా, 1991లో ఆ సంఖ్య 53కు చేరుకుంది. అనంతరం 2013లో 30కి తగ్గగా, 2023లో మళ్లీ 59కి పెరిగింది. ఈ యుద్ధాలు/ఘర్షణల్లో మృతిచెందిన వారి సంఖ్య 1960లో 64 వేలు ఉండగా, 1990లో 80 వేలకు చేరుకుంది. 2005లో 12 వేలకు తగ్గగా, 2022లో ఏకంగా 2.77 లక్షలకు పెరిగింది.*

**మెరుగుపడని పరిస్థితులు**

*ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు హింస రికార్డు స్థాయికి చేరింది. ప్రపంచవ్యాప్తంగా సగం జనాభా ఈ యుద్ధ ప్రభావాన్ని చవిచూస్తున్నది. పరిస్థితులు ఏమాత్రం మెరుగుపడుతున్నట్టు కనిపించడం లేదు. యుద్ధం ప్రారంభమైన ఏడాదిన్నర తర్వాత.. తాజాగా గాజాపై గ్రౌండ్ ఆపరేషన్‌ను ఇజ్రాయెల్ మరింత ఉద్ధృతం చేసింది. ఇక శాంతి చర్చలు జరుగుతున్న సమయంలో, ఉక్రెయిన్‌పై గత మూడేండ్లలో ఎన్నడూ లేనంతగా రష్యా వైమానిక దాడులకు దిగింది.*

### ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలు




## గాజాపై ఇజ్రాయెల్ దాడి.. 38 మంది మృతి

*గాజా స్ట్రిప్, మే 25: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. 24 గంటల వ్యవధిలో ఆ దేశం జరిపిన వైమానిక దాడుల్లో 38 మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ ఆదివారం తెలిపింది. ఒక టెంట్‌లో ఆశ్రయం పొందుతున్న తల్లి, ఆమె ఇద్దరు పిల్లలు కూడా మృతుల్లో ఉన్నారని వివరించింది. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన తర్వాత మార్చి నుంచి ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల్లో 3,785 మంది పౌరులు మరణించారని వెల్లడించింది. కాగా, హమాస్‌ను పూర్తిగా నిరాయుధీకరణ చేయడమే కాక, వారి వద్ద బందీలుగా ఉన్న 53 మంది తమ దేశ పౌరులను విడిపించేంత వరకు దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రతిజ్ఞ బూనింది. అంతేకాక, గత రెండున్నర నెలల నుంచి గాజాకు ఆహారం, మందులు, చమురు సరఫరాను నిలిపివేసింది. దీంతో అక్కడి పౌరులు ఆకలితో అల్లాడుతున్నారు. ఐరాస, ఇతర అంతర్జాతీయ సంస్థల ఒత్తిడి మేరకు మానవతా సాయాన్ని పాక్షికంగా ఇజ్రాయెల్ పునరుద్ధరించింది.*




ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణిదాడి.. మంటలను ఆర్పుతున్న ఫైర్ ఫైటర్స్

## ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- రాజధాని కీవ్ సహా పలు నగరాలపై 367 డ్రోన్లు, క్షిపణుల ప్రయోగం
- ముగ్గురు చిన్నారులు సహా 13 మంది మృత్యువాత
- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అతిపెద్ద వైమానిక దాడి

మాస్కో, మే 25: ఒక వైపు ఖైదీల మార్పిడి జరుగుతుండగానే, మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. రాజధాని కీవ్‌తో సహా పలు నగరాలపై భారీగా డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో ముగ్గురు చిన్నారులు సహా 13 మంది మరణించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన అతి పెద్ద వైమానిక దాడి ఇదే. రష్యా దళాలు 367 డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించాయని ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. వీటిలో 266 డ్రోన్లు, 45 క్షిపణులను కూల్చివేశామని తెలిపింది. కీవ్, ఖార్కీవ్, మైకోలైవ్, టెర్నోపిల్, ఖ్మెల్నిట్స్కీ నగరాలపై ఈ దాడులు జరిగినట్టు పేర్కొన్నది. వారం రోజుల వ్యవధిలో రష్యా రెండోసారి భీకర దాడికి పాల్పడినా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా విమర్శించారు. వెంటనే రష్యాపై కఠిన ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కాగా, మాస్కోపై దాడికి ప్రయత్నించిన 95 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశామని, 12 డ్రోన్లను అడ్డుకున్నామని రష్యా ప్రకటించింది. 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ఒత్తిడి తెస్తున్న క్రమంలో ఈ దాడులు జరిగాయి. ఈ హింసాత్మక ఘటనల మధ్యనే రెండు దేశాలు ఒక్కొక్కటీ వెయ్యి మంది ఖైదీలను మార్పిడి చేసుకున్నాయి.



## పాక్ అణ్వాయుధాల ఆధునికీకరణ

- చైనా ఆర్థిక, సైనిక సాయం
- తన ఉనికికి భారత్ ముప్పు అని పాక్ భావిస్తున్నది
- అమెరికన్ సంస్థ నివేదిక


వాషింగ్టన్: పాకిస్థాన్ తన అణ్వాయుధాలను ఆధునికీకరిస్తున్నదని అమెరికన్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వెల్లడించింది. దీనికి చైనా సైనిక, ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపింది. ఆదివారం విడుదల చేసిన వరల్డ్ థ్రెట్ అసెస్‌మెంట్ నివేదిక ప్రకారం, పాకిస్థాన్ సైన్యం రానున్న సంవత్సరంలో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే అవకాశం గల అంశాల్లో అణ్వాయుధాల ఆధునికీకరణతోపాటు పొరుగు దేశాలతో సరిహద్దులను దాటి ఘర్షణలకు పాల్పడటం కూడా ఉంది. భారీ విధ్వంసకర ఆయుధాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన పదార్థాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనా నుంచి పాకిస్థాన్ సమకూర్చుకుంటున్నది. చైనా నుంచి హాంకాంగ్, సింగపూర్, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గుండా వీటిని రప్పిస్తున్నది.

## కుంచించుకుపోతున్న పసిఫిక్!

- ఫలితంగా కొత్త ఖండం ఆవిర్భావం!
- 20-30 కోట్ల ఏండ్లలో సూపర్ కాంటినెంట్ అమేసియా ఏర్పాటు
- చైనా, ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల అంచనా



న్యూఢిల్లీ: భూమి స్వరూపంలో మార్పులు రాబోతున్నాయి. పసిఫిక్ మహాసముద్రం క్రమంగా కుంచించుకుపోతున్నది. ఇది పూర్తిగా అంతరించిపోయి, భూమి లోపలి టెక్టోనిక్ ప్లేట్స్ ఒక చోటుకు చేరుకుంటాయి. ఫలితంగా రానున్న 20-30 కోట్ల సంవత్సరాల్లో కొత్తగా సూపర్ కాంటినెంట్ ఆవిర్భవిస్తుంది. ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వవిద్యాలయం, చైనాలోని పెకింగ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అడ్వాన్స్‌డ్ సూపర్‌కంప్యూటింగ్ మోడల్స్‌ను వినియోగించి ఈ అంచనా వేశారు. నేషనల్ సైన్స్ రివ్యూ జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది. ఈ పరిశోధకుల్లో ఒకరైన డాక్టర్ చువాన్ హువాంగ్ మాట్లాడుతూ, ప్రతి 60 కోట్ల సంవత్సరాలకు ఒక సూపర్ కాంటినెంట్ ఏర్పడుతుందని, ఇది ఏర్పడటం కోసం 200 కోట్ల సంవత్సరాల కాలంలో భూమిపైగల ఖండాలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ఖండాలు కూడా మరో 20 కోట్ల సంవత్సరాల్లో మళ్లీ ఒక చోటుకు చేరుతాయని చెప్పారు. ఫలితంగా ఏర్పడే కొత్త సూపర్ కాంటినెంట్‌కు అమేసియా అని పేరు పెట్టినట్లు తెలిపారు. అమెరికా, ఆసియా ఢీకొన్నపుడు పసిఫిక్ మహాసముద్రం అంతరించిపోతుందని కొందరు విశ్వసిస్తున్నందువల్ల ఈ పేరు పెట్టామన్నారు. పసిఫిక్ మహాసముద్రం మూతపడితే, ఆస్ట్రేలియా మొదట ఆసియాను ఢీకొడుతుందని, ఆ తర్వాత అమెరికా, ఆసియా ఖండాలను కలుపుతుందని చెప్పారు.



## కదులుతున్న ఎవరెస్ట్!

### సంవత్సరానికి కొన్ని మిల్లీమీటర్లు స్థానభ్రంశం

*న్యూఢిల్లీ: ఎవరెస్ట్ శిఖరం నెమ్మదిగా కదులుతున్నట్లు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) డాటాను బట్టి తెలుస్తున్నది. భారతదేశం, యూరేసియా మధ్య భూమి లోపలి భాగంలో ఘర్షణల వల్ల ఎవరెస్ట్ సంవత్సరానికి కొన్ని మిల్లీమీటర్ల చొప్పున ఈశాన్య దిశగా కదులుతున్నట్లు గుర్తించారు. ఈ కదలిక ఆగిపోయే సంకేతాలు కనిపించడం లేదు. దీనికి 75 కి.మీ. దూరంలోని అరుణ్ నది ఈ శిఖరాన్ని బలంగా ఎత్తుతున్నది. ఈ నదితో హిమాలయ శిలలు కరిగిపోతున్నాయి. దీంతో ఎవరెస్ట్ శిఖరం పడవ మాదిరిగా తేలుతున్నదని అంటున్నారు. భారత్ సంవత్సరానికి 5 సెం.మీ. చొప్పున యూరేసియావైపు వెళ్తున్నది. వీటి మధ్య ఎవరెస్ట్ చిక్కుకుని, పక్కకు జరుగుతున్నది. పర్వతారోహకులు కేవలం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం లేదని, వారు భూమి టెక్టోనిక్ ఎలివేటర్‌పై స్వారీ చేస్తున్నారని అభివర్ణిస్తున్నారు.*